తెలుగు దినపత్రిక

RNI/PRGI : TGTEL/26/A2468

త్రినేత్ర

ట్రూత్‌లైన్

నిజం నిక్కచ్చిగా.. నిరంతరం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

రెండు తెలుగు రాష్ట్రాల్లో -
త్రినేత్ర ట్రూత్‌లైన్ తెలుగు దిన పత్రికలో

జిల్లా బ్యూరో, జిల్లా స్టాఫ్- డివిజన్ అసెంబ్లీ ఇంఛార్జీలు
మండల రిపోర్టర్ కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నంబరు

94419 29000

సంపుటి : 01 సంచిక : 208 ఎడిటర్ : పెరిక అభిలాష్ బుధవారం 18-11-2026 పేజీలు : 4 వెల: రూ.2

www.youtube.com/@Thrinethra Truthlinenews | thrinethratruthline_news | Thrinethra Truthline News | www.epaperthrinethratruthline.co.in/

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు

మనీలా ఆసియాన్ సదస్సులో మోదీ పిలుపు



ఢిల్లీ :(త్రినేత్ర ట్రూత్‌లైన్)

భారత్–ఆసియాన్ దేశాల కూటమి కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, కాబట్టి మన ఉమ్మడి భవిష్యత్తును పోటీ కాకుండా పరస్పర సహకారం నిర్దేశించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా–ఆసియాన్ సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ భాగస్వామ్యంలో ఆసియాన్ ఐక్యత, దాని కీలక భూమికకు భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 'గడిచిన కొన్నేళ్లుగా ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోంది. నేడు ప్రపంచానికి అత్యంత అవసరమైనది శాంతి, స్థిరత్వం, ఊహించదగిన భవిష్యత్తు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సదస్సు ఇతివృత్తమైన 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్, టుగెదర్' కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది' అని మోదీ పేర్కొన్నారు.ఈ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి చిహ్నంగా మార్చే శక్తి, (మిగతా 2లో..)

ప్రజల ఆశీర్వాదమే నా బలం: మంత్రి సీతక్క



(త్రినేత్ర ట్రూత్‌లైన్) ములుగు :

ప్రజల కోసం పోరాటం చేసిన నాటి నుంచి నేటి వరకు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితమైందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు ప్రజాయుద్ధంలో తుపాకీ చేతబట్టి ప్రజల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం పోరాటం చేశానని, నేడు ప్రజల ఆశీర్వాదంతో అసెంబ్లీకి వెళ్లి మంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. తన జీవితంలో వచ్చిన ఈ మార్పు, రాజకీయంగా తాను ఎదిగిన స్థానం అంతా ప్రజలు అందించిన ఆదరణ, ఆశీర్వాదం వల్లే సాధ్యమైందని భావోద్వేగంతో తెలిపారు. నాడు పోరాట మార్గంలో ఉన్నా.. నేడు ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా తన లక్ష్యం మాత్రం ఒక్కటేనని, ప్రజల పక్షాన నిలబడటం, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు..

ప్రజల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమాజంలోని అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల ద్వారా అండగా నిలవడమే లక్ష్యమని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ఏ ఒక్క పేద కుటుంబం కూడా సంక్షేమ ఫలాలకు దూరం కాకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నూతన పింఛన్ల పంపిణీ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వారి జీవనానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో ములుగు ప్రాంత అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

ఇంటర్ బోర్డు రద్దు చేస్తామంటే ఊరుకోం..

రేవంత్ లెక్కలు తప్పంటూ కవిత విమర్శలు



(త్రినేత్ర ట్రూత్‌లైన్)హైదరాబాద్ :

రాష్ట్రంలో ఇంటర్ బోర్డు రద్దు చేస్తామంటే ఒప్పుకోమని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయంపై మేధావులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యావేత్తలతో చర్చలు జరపాలని తెలిపారు. డ్రాప్ అవుట్స్ పేరుతో ఇంటర్ బోర్డును రద్దు చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న లెక్కలు తప్పని చెప్పుకొచ్చారు. అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్‌ను ఎడ్యుకేషనల్ రిఫార్మ్స్‌గా భావించొద్దని ప్రతిపాదనపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పందించారు. ఒంటెత్తు పోకడలతో ఇంటర్ బోర్డును హితవుపలికారు. ఇంటర్ బోర్డును రద్దు చేయాలన్న నిర్ణయాన్ని తాము పూర్తిగా వ్యతిరేకించటం లేదని.. కానీ ఈ మార్పు జరగాలంటే 3 నుంచి 10 ఏళ్ల సమయం ప్రాసెస్ జరగాలని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న విద్యావిధానంలో మార్పు చేస్తున్నప్పుడు కచ్చితంగా స్టేక్ హోల్డర్స్‌తో మాట్లాడాలని కవిత అన్నారు. కానీ ఈ ప్రభుత్వం అడిగితే ఎదురుదాడి చేసే పరిస్థితిలో ఉందంటూ వ్యాఖ్యానించారు. పది తరగతి తర్వాత ఇంటర్‌కు వెళ్తున్న (మిగతా 2లో..)

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం..

రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు: హరీశ్ రావు



(త్రినేత్ర ట్రూత్‌లైన్) సంగారెడ్డి :

జిల్లాలోని నిజాంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు..వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు సరిగా జరగడం లేదని ఆరోపించారు. నెల రోజులుగా ఎదురుచూస్తున్న రైతులు చివరకు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నవడ్లకు బోనస్ చెల్లించడం లేదని.. ఇప్పటివరకు బోనస్‌పై జీవో విడుదల చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. క్వింటాల్ ధాన్యానికి పది కిలోల వరకు తరుగు తీస్తున్నారని.. మరోవైపు ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో దళారులు ధరలు తగ్గిస్తున్నారని విమర్శించారు. సన్నవడ్లకు బోనస్‌పై వెంటనే జీవో విడుదల చేయడంతో పాటు అన్ని రకాల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల ఎకరాల్లో (మిగతా 2లో..)

టెక్ ప్రపంచానికి 'పీడకల'గా మారిన నవంబర్..

వరుస ఘటనలు నేర్పుతున్న గుణపాఠం ఏంటి?



(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవుడికి సేవలు అంతే సులభతరంఅవుతున్నాయి. కొత్త కొత్త ఆవిష్కరణలు మనిషి జీవితాన్ని మరింత సుఖవంతం చేస్తున్నాయి. వీటికి తోడు ఏఐ రాకతో సమీప భవిష్యత్ లో మనిషి ఊహకు అందని పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయనే చర్చ జరుగుతోంది. ఇటువంటి తరుణంలో ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల సంభవిస్తున్న పరిణామాలు సర్వత్రా కొత్త భయాందోళనలకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా టెక్ ప్రపంచంలో ఈ నవంబర్ నెల ఒక పీడకలలా మారింది. నెల సగం కూడా గడవకముందే ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ టెక్ సంస్థలు, బ్యాంకులు, విమానయాన సేవల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి. అక్టోబర్ చివర్లో క్రిప్టో ప్లాట్‌ఫామ్ 'బైనాన్స్'లో జరిగిన 6.3 బిలియన్ డాలర్ల భారీ హ్యాకింగ్ మరవకముందే, నవంబర్‌లో వరుస సాంకేతిక లోపాలు, సైబర్ దాడులు సామాన్యుల నుంచి కార్పొరేట్ సంస్థల వరకు అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. (మిగతా 2లో..)

ప్రపంచస్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు



(త్రినేత్ర ట్రూత్‌లైన్) రంగారెడ్డి :

ప్రపంచ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఏరోస్పేస్ గ్లోబల్ సప్లై చైన్‌లో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు గుర్తింపు తెస్తామని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు తిమ్మాపూర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థతోపాటు టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. (మిగతా 2లో..)

సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఏది?

కాంగ్రెస్‌కు కేటీఆర్ ప్రశ్న



(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్ :

సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్' పుస్తకంపై బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ స్పందించారు. తెలంగాణ ఇచ్చింది సోనియమ్మేనని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటుంటారని.. మరి ఆమె ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణపై కాంగ్రెస్‌కు ఎన్నడూ నిజమైన ప్రేమ లేదని.. రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. 'సోనియా గాంధీ ఆత్మలో తెలంగాణ లేదు.. గుండెల్లో తెలంగాణ లేదు. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదు.. తెలంగాణ ప్రజల పోరాట ఫలితం. కేసీఆర్ నాయకత్వంలో సాగిన ప్రజా ఉద్యమమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి అసలు కారణం. తెలంగాణ ప్రజలు సృష్టించిన రాజకీయ అనివార్య పరిస్థితులకు తలొగ్గే కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. (మిగతా 2లో..)

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం..

(మొదటిపేజీ తరువాయి)

పంటలు నష్టపోయినా ప్రభుత్వం రైతులకు పరిహారం అందించలేదని హరీశ్ రావు ఆరోపించారు. కనీసం పంట నష్టం వివరాలను కూడా నమోదు చేయలేదని విమర్శించారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు రైతులకు ఎకరాకు రూ.5 వేల చొప్పున సాయం అందిస్తుంటే.. తెలంగాణలో మాత్రం రైతులకు ఎలాంటి సాయం అందడం లేదన్నారు. గతంలో వడగండ్ల వానలతో పంటలు నష్టపోయినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చిందని గుర్తుచేస్తూ, ప్రస్తుతం కూడా ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేల సాయం అందించాలని డిమాండ్ చేశారు. యాసంగి రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతుబీమా కొత్త విధానంలో కుటుంబానికి ఒక్కరికే కాకుండా అర్హులైన రైతులందరికీ ప్రయోజనం కల్పించాలని కోరారు.

సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన ఏది?

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమ ఉప్పెనలో కొట్టుకుపోతామన్న భయంతోనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది.తెలంగాణపై కాంగ్రెస్‌కు ఎన్నడూ నిజమైన ప్రేమ లేదు. సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం.. కాంగ్రెస్ ప్రచారంలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. తెలంగాణ చరిత్రను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవాలని చూడటం సిగ్గుచేటు' అంటూ కేటీఆర్ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు.పీవీ నరసింహారావు కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి.. సోనియాగాంధీ ఆత్మకథపై విమర్శలు గుప్పించారు. 'పీవీపై అంత ప్రేమ ఉంటే ఆయన అంత్యక్రియలను ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదు. తెలంగాణ నాయకత్వం, ప్రజల పట్ల సోనియా గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ నిజమైన అభిమానం లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయ అవసరాల కోణంలోనే చూసింది. తెలంగాణ సాధనలో ప్రజల త్యాగాలను, కేసీఆర్ నాయకత్వాన్ని విస్మరించే ప్రయత్నం చేస్తూ అబద్దాలను ప్రచారం చేస్తోంది. కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, పోరాటాలు, కేసీఆర్ నాయకత్వంలోని ఉద్యమ ఫలితమే స్వరాష్ట్రం. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాభిక్ష కాదు.. ప్రజల పోరాటంతో సాధించుకున్న హక్కు. తెలంగాణ ఉద్యమ చరిత్రను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ చెరిపివేయలేదు' అంటూ ఆమె కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు

(మొదటిపేజీ తరువాయి)

సంకల్పం భారత్, ఆసియాన్ రెండింటికీ ఉన్నాయని ప్రధాని అన్నారు. 'భారతదేశ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానితో ఒకటి లోతుగా ముడిపడి ఉన్నాయి. రాబోయే సంవత్సరాల్లో 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045', 'వికసిత భారత్ 2047' లక్ష్యాలు మన ఉమ్మడి ఆకాంక్షలను నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి' అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశం మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు, సురక్షితమైన, సమ్మిళిత, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి దోహదపడుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. 1967లో ఏర్పాటైన ఆసియాన్ కూటమి ఆగ్నేయాసియా దేశాల మధ్య ఆర్థిక వృద్ధి, రాజకీయ స్థిరత్వం, భద్రత, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. ఇందులో బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, తైమూర్-లెస్టే, వియత్నాం సహా మొత్తం 11 సభ్య దేశాలు ఉన్నాయి. భారత్, అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా తదితర దేశాలు ఈ కూటమికి డైలాగ్ పార్టనర్స్‌గా వ్యవహరిస్తున్నాయి.

ఇంటర్ బోర్డు రద్దు చేస్తామంటే ఊరుకోం..

(మొదటిపేజీ తరువాయి)

వారిలో 10లో ఆరుగురు మాత్రమే ఉంటున్నా రని చెబుతున్నారని.. కానీ అది గవర్నమెంట్ స్కూల్లో చదివిన విద్యార్థుల లెక్కలు అయి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. పూర్తిగా ఓవరాల్‌గా చూస్తే మాత్రం డ్రాప్ అవుట్స్ లెక్క 16 శాతంగానే ఉందని చెప్పుకొచ్చారు.గవర్నమెంట్‌లో పదో తరగతి చదివిన విద్యార్థులు కూడా ఆ తర్వాత ప్రైవేట్‌లోనో, ఇతర కోర్సుల్లోనో చేరుతున్నారని కవిత అన్నారు. నిజానికి అలా జరిగితే కూడా గవర్నమెంట్ స్కూళ్లలో చదివే విద్యార్థుల డ్రాప్ అవుట్లు ఎక్కువగా ఉంటే అది ప్రభుత్వం తప్పే అని తెలిపారు. డ్రాప్ అవుట్లకు సంబంధించి చాలా కారణాలున్నాయని.. నీతి ఆయోగ్ కూడా చాలా కారణాలు చెప్పిందన్నారు. ముఖ్యంగా డబ్బులు లేకపోవటమే మొదటి కారణమని భావిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో బస్సు సౌకర్యం లేని పరిస్థితి కూడా కారణమే అని చెప్పుకొచ్చారు. డ్రాప్ అవుట్లలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులే ఉంటున్నారని.. ఈ పరిస్థితిని నివారించేందుకు గుజరాత్‌లో నమో లక్ష్మి అనే పథకాన్ని అమలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ చీఫ్ అన్నారు. డైరెక్ట్‌గా డ్రాప్ అవుట్ అవుతున్న విద్యార్థుల ఖాతాల్లోకే ఏటా రూ.928 కోట్లు జమ చేస్తున్నారని తెలిపారు. దీని కారణంగా అక్కడ డ్రాప్ అవుట్లలో 16 శాతం తగ్గిందన్నారు. తెలంగాణలో కూడా అలాంటి పథకాన్ని అమలు చేస్తే డ్రాప్ అవుట్ల సంఖ్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. పది తరగతి నుంచి ఇంటర్‌కు వెళ్లే విద్యార్థుల్లో డ్రాప్ అవుట్లు ఎక్కువగా విద్యార్థినిలే ఉంటున్నారని ముఖ్యమంత్రి చెబుతున్నారని.. కానీ ఆయన లెక్కలు తప్పున్నారు. 10 నుంచి ఇంటర్‌కు వెళ్తున్న ఆడవాళ్ల సంఖ్య 77.4 శాతంగా ఉంటే మగవాళ్ల సంఖ్య 68.4 శాతంగా ఉందని తెలిపారు. అబ్బాయిలే 51 శాతం ఫెయిల్ అవుతున్నారని... గంజాయి తీసుకోవటం, చదువును నిర్లక్ష్యం చేయటం కారణంగా ఈ పరిస్థితి ఉందని కవిత పేర్కొన్నారు.

కేసీఆర్‌తో కోనేటి నరసింహ ఆత్మీయ భేటీ

ఎరుకల సమస్యలు, రాజకీయ ప్రాతినిధ్యంపై గంటకు పైగా కీలక చర్చ

(త్రినేత్ర ట్రూత్‌లైన్) హైదరాబాద్:



తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోనేటి నరసింహ ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎరుకల సమాజ అభ్యున్నతి, సామాజిక, రాజకీయ సమస్యలపై కేసీఆర్‌తో గంట పది నిమిషాల పాటు కోనేటి నరసింహ ప్రత్యేకంగా చర్చించారు. రాజకీయంగా వెనుకబడిన ఎరుకల సమాజానికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించేలా ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని, ఎరుకల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిజాంపేట్‌లో ఏకలవ్య భవనం నిర్మించాలని ఆయన కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తరతరాలుగా ఎరుకలు నమ్ముకున్న పిగ్ ఫామ్స్ (పందుల పెంపకం) ఆధునీకరణకు ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు. ఎరుకల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ ఎరుకల నాంచారమ్మ జాతర (రామానుజపురం, పిల్లాయిపల్లి) విశిష్టతను వివరిస్తూ, జాతరకు మరింత అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ త్యాగం, నాయకత్వ పటిమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కోనేటి నరసింహ కొనియాడారు. ఎరుకల సమాజానికి విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ భేటీలో ఎల్బీనగర్ టిఎవైఎస్ అధ్యక్షులు ఉండ్రాతి రవి, ఎరుకల యువజన సంఘం నాయకులు పల్లంకొండ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్ ప్రపంచానికి 'పీడకల'గా మారిన నవంబర్..

(మొదటిపేజీ తరువాయి)

178 దిగ్గజ కంపెనీల వెబ్‌సైట్లలోకి మాల్వేర్:

బ్యాంకింగ్ రంగంతో పాటు ఈ నవంబర్ లో మరి కొన్ని అంశాల్లో సంచలనాలు నమోదయ్యాయి. వెబ్‌సైట్ టెస్టింగ్ కోసం వాడే 'ఆప్టిమైజ్లీ' ప్లాట్‌ఫామ్ ద్వారా హ్యాకర్లు 178 ప్రముఖ కంపెనీల వెబ్‌సైట్లలోకి మాల్వేర్‌ను చొప్పించారు. ఇందులో జూమ్, బీబీసీ, సీఎన్ఎన్, హెచ్ఎస్‌బీసీ, సేల్స్‌ఫోర్స్, ఐకియా వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. ఈ వెబ్‌సైట్లను సందర్శించిన వినియోగదారుల పేమెంట్ వివరాలు, క్రిప్టో వాలెట్ల నుంచి హ్యాకర్లు డబ్బు దొంగిలించినట్లు పరిశోధకులు గుర్తించారు.

యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానాలకు బ్రేక్:

నవంబర్ 16నే అమెరికాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌లో వెబ్ ఆధారిత సాంకేతిక సమస్య తలెత్తింది. పైలట్లు ఉపయోగించే కమ్యూనికేషన్, విమాన బరువు లెక్కించే అప్లికేషన్లు పనిచేయకపోవడంతో పలు విమానాలు ఆలస్యమయ్యాయి. గంట తర్వాత ఈ సమస్య పరిష్కారమైంది. ఇది కూడా సైబర్ దాడి కాదని సంస్థ తెలిపింది.

విమానయాన రంగంలో అంతరాయం:

నవంబర్ 13న అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ నెట్‌వర్క్‌లో తలెత్తిన కమ్యూనికేషన్ లోపం వల్ల దేశవ్యాప్తంగా విమానాలను నిలిపివేయాల్సి వచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన రూటర్‌లో డేటా ఓవర్‌లోడ్ కావడంతో 17 కంట్రోల్ సెంటర్లలో రాడార్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఫలితంగా నాలుగు గంటల పాటు విమాన రాకపోకలు స్తంభించి, 10,000కు పైగా విమానాలు రద్దు కావడం లేదా ఆలస్యం కావడం జరిగింది. 9/11 దాడుల తర్వాత ఇదే అతిపెద్ద అంతరాయమని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ పేర్కొన్నారు.

మైక్రోసాఫ్ట్ సేవలకు బ్రేక్:

నవంబర్ 12న మైక్రోసాఫ్ట్ అవుట్‌లుక్, టీమ్స్, కోపైలట్ సేవలు ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. నెట్‌వర్క్ కెపాసిటీ అప్‌గ్రేడ్ సమయంలో కొన్ని సర్వర్లు ఆఫ్‌లైన్‌లోకి వెళ్లడంతో, మిగిలిన సర్వర్లపై ట్రాఫిక్ భారం పెరిగి ఈ సమస్య తలెత్తింది. దాదాపు 36 గంటల పాటు ప్రభుత్వ విభాగాలు, కార్పొరేట్ ఆఫీసులు, విమానయాన సంస్థలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. వీటితో పాటు డచ్ షిప్పింగ్ దిగ్గజం 'మెర్స్క్' నుంచి 100 జీబీ డేటాను దొంగిలించిన హ్యాకర్లు 5 మిలియన్ డాలర్ల బిట్‌కాయిన్ డిమాండ్ చేశారు. మరోవైపు ఫ్రాన్స్ జాతీయ పోస్టల్ ఆపరేటర్ అనుబంధ సంస్థ 'మైలెవా'పై జరిగిన సైబర్ దాడిలో సుమారు 2.2 కోట్ల మంది వ్యక్తిగత డేటా బహిర్గతమైంది. మొత్తానికి వరుస సాంకేతిక వైఫల్యాలు, హ్యాకింగ్ ఘటనలు డిజిటల్ మౌలిక సదుపాయాల భద్రతపై మరోసారి తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

ఫిజికల్ కరెన్సీ తప్పదా?

ఈ పరిణామాలన్ని మానవులను అప్రమత్తంగా ఉండేందుకు ఉదాహరణలు అనే చర్చ సోషల్ మీడియాలో జరుతోంది. ముఖ్యంగా సోమవారం (నవంబర్ 16) అమెరికాలోని అతిపెద్ద బ్యాంక్ 'జేపీ మోర్గాన్ చేజ్'లో సాంకేతిక లోపం తలెత్తడంతో అత్యవసరంగా డబ్బు అవసరమైన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆన్-ప్రెమిస్ హార్డ్‌వేర్ సిస్టమ్స్‌లో వచ్చిన సాఫ్ట్‌వేర్ బగ్ కారణంగా వేలాది మంది ఖాతాదారులు తమ ఖాతాలను యాక్సెస్ చేయలేకపోయారు. ఏటీఎం లావాదేవీలు, చెల్లింపులు నిలిచిపోయాయి. దీని ప్రభావం వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి ఇతర బ్యాంకుల లావాదేవీలపైనా పడింది. అయితే, ఇది సైబర్ దాడి కాదని, సాంకేతిక లోపం మాత్రమేనని స్పష్టం చేసిన బ్యాంక్, ఆ తర్వాత సేవలను పునరుద్ధరించింది. అయితే ప్రపంచం అంతా డిజిటల్ కరెన్సీ వైపు పరుగులు తీస్తున్న తరుణంలో ఈ ఘటన ఫిజికల్ కరెన్సీ ప్రాముఖ్యతను చాటిచెప్పినట్లైందనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి.

ప్రపంచస్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

(మొదటిపేజీ తరువాయి)

ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. తెలంగాణలో ఏరోస్పేస్ పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ సంస్థ ఏర్పాటుతో విమాన విడిభాగాల తయారీ, మరమ్మతులకు అవసరమైన అధునాతన టూల్స్ అందుబాటులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.విమానాలు, విమాన ఇంజిన్ల తయారీ, నిర్వహణకు ప్రత్యేక పరికరాలు తయారవుతాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఇప్పటివరకు విదేశాలపై ఆధారపడుతున్న టూలింగ్ అవసరాలకు ఇకపై స్థానికంగానే తయారవుతాయని అన్నారు. ఏరోస్పేస్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రకటించారు. డిజైన్, ఇంజినీరింగ్, ప్రెసిషన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గ్లోబల్ కంపెనీలతో స్థానిక ఎంఎస్ఎంఈల అనుసంధానానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, రక్షణ రంగాలకు తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్--2047' విజన్‌లో భాగంగా ప్రపంచ స్థాయి పారిశ్రామిక వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలు అమలు చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

తిగాపూర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏరోస్పేస్ టూలింగ్ సెంటర్ ఏర్పాటు కావడం సంతోంగా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతిలో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విమానాలు, ఏరో ఇంజిన్ల తయారీ, నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు, ఫిక్చర్లను ఈ కేంద్రంలో తయారు చేయనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు దిగుమతులపై ఆధారపడిన ఈ రంగంలో దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ నంస్థ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఇలాంటి సంస్థలు తోడ్పడతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో సంస్థను ఏర్పాటు చేసినందుకు జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధుల బృందానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూర్ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, అంబటి ప్రభాకర్, సాయిలు, కొర్ర రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గోపాష్టమి పర్వదినాన 300 మంది చిన్నారుల ఆకలి తీర్చిన కృష్ణ గోపాల్ సేవా సమితి

సేవే లక్ష్యం - చిన్నారుల నవ్వే సంతోషం

మీ సంతోషాన్ని సేవగా మార్చండి - కృష్ణ గోపాల్ సేవా సమితి



(త్రినేత్ర ట్రూత్‌లైన్)వనస్థలిపురం:

శ్రీకృష్ణుడికి అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్ర గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అత్యంత హృద్యంగా, భక్తి భావంతో కూడిన సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ సమితి సభ్యులు ఈ శుభదినాన 200 నుండి 300 మంది అనాథ మరియు నిరుపేద చిన్నారులకు ఉదయం అల్పాహారాన్ని అందించి వారి ఆకలి తీర్చారు. శ్రీకృష్ణుడు చిన్నారుల రూపంలోనే ఉంటాడనే దృఢమైన నమ్మకంతో సమితి సభ్యులు ఆ బాలబాలికలకు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో అల్పాహారం వడ్డించి వారితో కొంత సమయం ఆనందాన్ని పంచుకున్నారు. ఆ చిన్నారుల ముఖాల్లో వెల్లివిరిసిన అమాయకమైన చిరునవ్వులను చూసి అక్కడ పాల్గొన్న ప్రతి ఒక్కరి హృదయం పులకించిపోయింది. కేవలం ఆహారం అందించడమే కాకుండా ఆ చిన్నారులకు తాము ఒంటరి వారము కాదు, తమ వెనుక ఆదుకునే సమాజం ఉందనే భరోసాను కలిగించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులందరూ ఎంతో ఐకమత్యంతో, క్రమశిక్షణతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల కోసం చేసిన ఈ చిన్న ప్రయత్నం వారి ముఖాల్లో పెద్ద చిరునవ్వును తీసుకురావడమే కృష్ణ గోపాల్ సేవా సమితి యొక్క నిజమైన సంతోషమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలనే సంకల్పంతో ఉన్నామని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. మీ జీవితంలోని పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు లేదా మీకు గుర్తుండిపోయే ఏ శుభ సందర్భాన్నైనా ఇలాంటి మంచి కార్యక్రమాల ద్వారా పేదవారి ముఖాల్లో ఆనందాన్ని నింపడం ద్వారా మరింత పుణ్యప్రదం చేసుకోవాలని కోరుకునే దాతలు,



దాతృత్వ హృదయులు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించవచ్చని సమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు. మీ సంతోషంలో కొంత భాగం మరొకరి ఆకలి తీర్చడానికి ఉపయోగపడితే అంతకంటే గొప్ప ఆనందం మరొకటి ఉండదని, మీరు అందించే ప్రతి సహాయం ఒక పేద బిడ్డ ఆకలి తీర్చి, వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని వారు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే వారు కృష్ణ గోపాల్ సేవా సమితి సెల్ నంబర్ 8106876999 ను సంప్రదించగలరు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా గోపాష్టమి వేడుకలు

జిల్లా గోరక్ష ప్రముఖ్‌గా గన్నమనేని ప్రదీప్ రావు నియామకం

(త్రినేత్ర ట్రూత్‌లైన్)



వేములవాడ:

కార్తీక శుద్ధ అష్టమి గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ వి హేచ్ పి ఆధ్వర్యంలో వేములవాడ పట్టణం లోని శ్రీ గాయత్రి దేవాలయంలో గోపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రాసం సమర్పించారు. భారతీయ సంస్కృతిలో గోవుకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరిస్తూ, ప్రతి ఒక్కరూ గోసంరక్షణకు కృషి చేయాలని నాయకులుపిలుపునిచ్చారు.అదేవిధంగా, ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా విశ్వహిందూ పరిషత్ నూతన గోరక్ష ప్రముఖ్‌గా గన్నమనేని ప్రదీప్ రావు నియమితులైనట్లు నాయకులు ప్రకటించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన క్షేత్ర ప్రముఖ్ గుమ్మల సత్యం జీ, విభాగ్ సహ కార్యదర్శి గజం రాజు, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల రాము గౌడ్ కు గన్నమనేని ప్రదీప్ రావు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రముఖ్ గుమ్మల సత్యం, విభాగ్ సహ కార్యదర్శి గజం రాజు, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల రాము గౌడ్, వేములవాడ పట్టణ అధ్యక్షులు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి గుండోజు గోపాల్ గార్లతో పాటు సనుగుల భాస్కర్, తిప్పర్తి సాయి కృష్ణ, తిప్పర్తి రమేష్, దండి గణేష్, కొక్కు గోపాలకృష్ణ, నంది శివ కుమార్, తదితర కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

: డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



(త్రినేత్ర ట్రూత్‌లైన్)**వరంగల్:**

నగరంలోని ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ హామీ ఇచ్చారు. నగరంలోని పలు ఆటో సంఘాల ముఖ్య నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. హైదరాబాద్‌లో ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 75 శాతం సబ్సిడీ అందిస్తున్న తరహాలోనే వరంగల్ నగరంలోని అర్హులైన ఆటో కార్మికులకు కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ విషయంపై సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఆటో కార్మికుల సమస్యలను సావధానంగా విన్న అయూబ్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఆటో సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ గోడపత్రికలను ఆవిష్కరించిన డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



(త్రినేత్ర ట్రూత్‌లైన్) **వరంగల్:**

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ గోడపత్రికలను జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీలు 50 శాతానికి పైగా ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణన ప్రశ్నావళిలో బీసీ కాలమ్ చేర్చాలని, బీసీలకు న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 14, 15 తేదీల్లో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించే బీసీల జనభేరి సభకు బీసీలంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చడమే అసలైన సేవ.. ఎంజీఎంలో అన్నదాన కార్యక్రమం

(త్రినేత్ర ట్రూత్‌లైన్) వరంగల్:



ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం గొప్ప మానవతా సేవ అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ లయన్ బేతి అశోక్ బాబు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన అధ్యక్షుడు లయన్ సింగారం శ్రీకర్ నేతృత్వంలో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులు, నిరుపేదలకు భోజనం అందించారు. ఈ సందర్భంగా బేతి అశోక్ బాబు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి, రోగుల సహాయకులకు అన్నదానం చేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన దాత మెంతుల సిరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఆడెపు రవీందర్, లకుం ఐలయ్య, హఫీజ్, చంద్రశేఖర్, ఎంజీఎం ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న ఆలయం ఎవరి సొత్తు కాదు కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీక

గర్భగుడి శిఖరాన్ని తొలగించాల్సిన అవసరమేంటి
అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
మీడియా, రాజకీయ పార్టీలకు ఆలయ ప్రవేశం కల్పించాలి
బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్



(త్రినేత్ర ట్రూత్‌లైన్) **వేములవాడ :**


దక్షిణ కాశీ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల పేరుతో ప్రాచీన నిర్మాణాలు, ఆగమ సంప్రదాయాలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి స్పష్టం చేశారు. రాజన్న ఆలయం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదని, కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి పనులపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని, నిర్మాణాల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గోపి మాట్లాడుతూ గత ఏడాది కాలంగా ఆలయ అభివృద్ధి పనులకు బీజేపీ సహకరిస్తూ వచ్చిందని, అయితే అభివృద్ధి పేరుతో ఆలయ ప్రాచీన వైభవానికి నష్టం కలిగించే పరిస్థితులు కనిపిస్తుండటంతో ప్రశ్నించాల్సి వస్తోందన్నారు.శిఖరం తొలగింపుపై సమాధానం చెప్పాలిగర్భగుడి ప్రాచీన నిర్మాణాన్ని ముట్టుకోబోమని గతంలో చెప్పిన అధికారులు ఇప్పుడు గర్భగుడి శిఖరాన్ని తొలగించే ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. స్లాబ్ నిర్మాణం కారణంగా గోపుర శిఖరం భక్తులకు కనిపించని పరిస్థితి ఏర్పడటానికి కారణాలేమిటో వెల్లడించాలన్నారు. నిర్మాణంలో లోపాలు జరిగాయా అధికారుల పర్యవేక్షణ లోపించిందా కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా అనే అంశాలపై విచారణ జరపాలని కోరారు.శృంగేరి పీఠం అనుమతితోనే పనులు చేపడుతున్నామని చెబుతున్న అధికారులు, ఏయే పనులకు అనుమతులు తీసుకున్నారో లిఖితపూర్వక పత్రాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై వాస్తవాలు తెలుసుకునేందుకు బీజేపీ నాయకులు స్వయంగా శృంగేరి పీఠాన్ని సందర్శించి పీఠాధిపతులను కలుస్తారని తెలిపారు.

పది ప్రశ్నలకు సమాధానాలేవీ

ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని కోట్ల నిధులు మంజూరు చేసింది ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు కాంట్రాక్టర్ ఎవరు గర్భగుడి శిఖరం తొలగింపునకు అనుమతి ఇచ్చింది ఎవరు దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం వంటి ప్రాచీన నిర్మాణాల పరిస్థితి ఏమిటి వాటి పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిట అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయి భక్తులకు పూర్తిస్థాయి దర్శనం ఎప్పుడు కల్పిస్తారు అనే ప్రశ్నలకు ప్రభుత్వం, ఆలయ అధికారులు నమాధానం చెప్పాలని గోపి డిమాండ్ చేశారు.మీడియా, రాజకీయ పార్టీలకు ప్రవేశం కల్పించాలిఆలయంలో జరుగుతున్న పనుల వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఆలయంలోకి ప్రవేశం కల్పించాలని కోరారు. గర్భగుడి శిఖరం, దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం తదితర నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఇవ్వాలన్నారు.అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరుఆలయ పనులను పరిశీలించేందుకు వెళ్లిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని గోపి తప్పుబట్టారు. ఆలయ పరిరక్షణ కోసం ప్రశ్నించడం నేరమా భక్తుల మనోభావాలను కాపాడాలని కోరడం తప్పా అని నిలదీశారు. అధికారులు తక్షణమే స్పందించి ఆలయ ప్రవేశానికి అనుమతి కల్పించాలని, అప్పటివరకు బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తుందని హెచ్చరించారు.ఆలయ అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరుతో ప్రాచీన కట్టడాలు, ఆగమ సంప్రదాయాలు, శిల్పకళా వారసత్వానికి నష్టం కలిగించడాన్నే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సిరికొండ శ్రీనివాస్, పొన్నాల తిరుపతిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెగుల సంతోష్ బాబు, పట్టణ కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాబీర్, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం.. పిల్లల భవిష్యత్తుకు భరోసా..

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి అరికట్టేలా ప్రజాప్రభుత్వ నిర్ణయాలు...
విద్యాసంస్కరణలకు ఆరుట్ల స్కూల్‌ను మోడల్‌గా తీర్చిదిద్దాం...
ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి..
నల్లకంచె గురుకులంలో సైన్స్ ఫెయిర్ ప్రారంభించిన ఎమ్మెల్యే...



(త్రినేత్ర ట్రూత్‌లైన్) **ఇబ్రహీంపట్నం:**

విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నల్లకంచెలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జోనల్ లెవల్ సైన్స్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మల్‌రెడ్డి...ఆరుట్ల పాఠశాలను విద్యారంగంలో ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం వెనుకాడదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట..

ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల భారాన్ని తగ్గించి, తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా ఉండేలా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే పన్నెండో తరగతి వరకు ఒకే పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తయ్యేలా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు కాస్మోటిక్స్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి...


తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కలలను సాకారం చేసే బాధ్యత విద్యార్థులపై ఉందని మల్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం అవసరమైన వసతులు కల్పించే బాధ్యత తీసుకుంటే, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకునే బాధ్యత విద్యార్థులదేనని అన్నారు.

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా చేయూత పెన్షన్ల పంపిణీ

మ. 2:00 గంటలకు పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని తారా కన్వెన్షన్‌లో కార్యక్రమం

(త్రినేత్ర ట్రూత్‌లైన్), **అబ్దుల్లాపూర్‌మెట్:**

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నేడు నియోజకవర్గ పరిధిలో పర్యటించి లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్లను పంపిణీ చేయనున్నారు. ఉదయం 11:00 గంటలకు మన్నెగూడ పరిధిలోని జేఎంఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిబట్ల, కొంగర, తుర్కయాంజాల్, తొర్రూర్ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ఆయన పెన్షన్లను అందజేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2:00 గంటలకు పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని తారా కన్వెన్షన్ లో కుంట్లూరు, పెద్ద అంబర్‌పేట్ డివిజన్లతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్లను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధిత ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.



బోయపాటి శ్రీను కొత్త కథ ఎంత వరకు వచ్చింది?



'అఖండ 2' విజయంతో జోష్‌లో ఉన్న బోయపాటి శ్రీను, అల్లు అర్జున్‌తో మరో సినిమా చేసేందుకు కథ సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'సరైనోడు' తర్వాత వీరిద్దరి కాంబోలో రానున్న ఈ చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించే అవకాశం ఉందని, రూ.150 కోట్ల బడ్జెట్‌తో మైథలాజికల్ మూవీగా తెరకెక్కవచ్చని టాక్. వచ్చే ఏడాది షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. అఖండ 2 తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నప్పటికీ బోయపాటి శ్రీను తదుపరి సినిమాకు చాలా సమయం తీసుకుంటున్నాడు. స్టార్ హీరోతోనే సినిమాను చేయాలనే ఉద్దేశంతో బోయపాటి శ్రీను కథను రెడీ చేసుకుని కూర్చున్నాడు. బోయపాటి శ్రీను వచ్చే ఏడాది అల్లు అర్జున్‌తో సినిమాను మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయంటూ వార్తలు వస్తున్నాయి. వీరిద్దరి కాంబోలో పదేళ్ల క్రితం సరైనోడు వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, అల్లు అర్జున్‌కి మంచి మాస్ ఇమేజ్‌ను తెచ్చి పెట్టింది. అందుకే బోయపాటి శ్రీను దర్శకత్వంలో మరోసారి నటించాలని అల్లు అర్జున్ భావించాడు. ఆ సమయంలోనే బోయపాటితో సినిమాకు నాంది పడినట్లు అయింది. అల్లు అర్జున్ గతంలో ఇచ్చిన మాట ఉన్న కారణంగా బోయపాటి శ్రీను ఆయనకు కథను రెడీ చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది.

బోయపాటి శ్రీనుతో అల్లు అర్జున్ మూవీ.. బోయపాటి శ్రీను రెడీ చేసుకు వచ్చిన కథ నచ్చడంతో అల్లు అర్జున్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలుస్తోంది. అల్లు అరవింద్ స్వయంగా నిర్మించేంతగా సినిమా కథ నచ్చిందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తుంది. దాదాపుగా రూ.150 కోట్ల బడ్జెట్‌తో బోయపాటి శ్రీను దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా రూపొందించే అవకాశాలు ఉన్నాయని కూడా చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న రాకా సినిమా వచ్చే ఏడాదిలో విడుదల అయ్యే అవకాశం ఉంది. ఆ సినిమాతో పాటు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో త్వరలో ప్రారంభం కాబోతున్న సినిమాను సైతం వచ్చే ఏడాది లేదా 2028 ఆరంభంలో విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు సినిమాల తర్వాత బోయపాటి శ్రీను మూవీ విడుదల ఉండే విధంగా ప్లాన్ చేస్తున్నారు. రాకా సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి అయింది.రాకా సినిమా తర్వాత లోకేష్ కనగరాజ్ మూవీ... ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాదిలో లోకేష్ కనగరాజ్ మూవీ ప్రారంభం కానుంది. ఆ సినిమా షూటింగ్ పూర్తి కాకుండానే బోయపాటి శ్రీను దర్శకత్వంలో సినిమాను బన్నీ ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోకేష్ సినిమాతో సమాంతరంగా బోయపాటి మూవీ కూడా బన్నీ చేయడం ద్వారా రాకా, లోకేష్ మూవీ, బోయపాటి మూవీ అటు ఇటుగా రెండు మూడు నెలల గ్యాప్ తో వచ్చే అవకాశాలు ఉంటాయని అభిమానులు భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుష్ప తర్వాత చాలా ఎక్కువ గ్యాప్ తీసుకున్నాడు. ఆ గ్యాప్ ను ఫిల్ చేయడం కోసం ఇలా మూడు సినిమాలు ఒకే సారి విడుదల ప్లాన్ చేస్తున్నాడా అంటే ఔను అనే సమాధానం వినిపిస్తుంది. అల్లు అర్జున్‌కు ఉన్న స్టార్‌డం నేపథ్యంలో బోయపాటితో తీయబోతున్న మైథలాజికల్ మూవీపై అంచనాలు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. మరి బోయపాటి ఎంత వరకు ఆ ఒత్తిడి బ్యాలెన్స్ చేస్తాడో చూడాలి.

ఎల్లమ్మ.. వేణు కాస్టింగ్‌లోనే ఏదో ఉంది!


'బలగం'తో గుర్తింపు తెచ్చుకున్న వేణు యెల్దండి తన రెండో సినిమా 'ఎల్లమ్మ'లోనూ పాత్రలకు సరిపోయే నటులనే ఎంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తుండగా, ప్రతినాయకుడి పాత్రకు చైతూ జొన్నలగడ్డ పేరు ప్రచారంలో ఉంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. దిల్ రాజు సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమా 2027 మార్చి 5న విడుదల కానుంది. ఒక సినిమా కోసం స్టార్ హీరోను ఎంచుకుంటే బిజినెస్ పరంగా కొన్ని ప్రయోజనాలు ఉంటాయి. అదే కొత్త వ్యక్తిని హీరోగా తీసుకుంటే ఆ రిస్క్ మొత్తం దర్శకుడిపైనే పడుతుంది.



అయినప్పటికీ కొందరు దర్శకులు కథలోని పాత్రకు ఎవరైతే సరిపోతారో వారినే ఎంచుకుంటారు. 'బలగం'తో మంచి గుర్తింపు సంపాదించుకున్న వేణు యెల్దండి ఇప్పుడు తన రెండో సినిమా 'ఎల్లమ్మ' విషయంలో కూడా అలాంటి ప్రయత్నమే చేస్తున్నట్లు కనిపిస్తోంది. మొదట 'ఎల్లమ్మ' కోసం నాని, నితిన్ లను అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌ను హీరోగా తీసుకున్నారు. ఇప్పటివరకు ఎన్నో సినిమాలకు సంగీతం అందించిన దేవిశ్రీని ప్రధాన పాత్రలో చూడటం ప్రేక్షకులకు కొత్త అనుభవమే. పైగా ఈ సినిమాలో ఆయన పర్షి అనే పాత్రలో కనిపించబోతున్నారు. కథకు తగ్గట్టుగానే దేవిశ్రీని ఎంచుకున్నట్లు వేణు గతంలో చెప్పారు. నిజానికి 'బలగం'లో కూడా వేణు పెద్ద స్టార్ల కోసం ప్రయత్నించలేదు. ప్రియదర్శి, కావ్య కళ్యాణ్‌రామ్‌తో పాటు తెలంగాణ పల్లెల్లో కనిపించే మనుషులను గుర్తుచేసే నటీనటులతో సినిమా తీశారు. ముఖ్యంగా కుటుంబ సభ్యుల మధ్య గొడవలు, ఊరి వాతావరణం, అక్కడి మనుషుల ప్రవర్తనను చూపించిన విధానం సినిమాకు బాగా కలిసొచ్చింది. ఆ సినిమాలో నటీనటులకంటే పాత్రలే ఎక్కువగా గుర్తుండిపోయాయి. ఇప్పుడు 'ఎల్లమ్మ'లోనూ అదే తరహా కాస్టింగ్ కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతినాయకుడి పాత్ర కోసం చైతూ జొన్నలగడ్డ పేరు చర్చల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 'రాజు వెడ్స్ రాంబాయి'లో వెంకన్న పాత్రతో మెప్పించిన చైతూకు తెలంగాణ యాసపై మంచి పట్టుంది. అయితే 'ఎల్లమ్మ'లో నటిస్తున్నట్లు చిత్రబృందం ఇంకా ప్రకటించలేదు. ఈ వార్త నిజమైతే వేణు మరోసారి పాత్రకు సరిపోయే నటుడినే ఎంచుకున్నట్లు చెప్పవచ్చు. అయితే 'బలగం'తో పోలిస్తే 'ఎల్లమ్మ'లో వేణుకు మరో సవాల్ ఉంది. మొదటి సినిమాలో కుటుంబ బంధాలు, భావోద్వేగాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఈసారి గ్రామీణ నేపథ్యంతో పాటు యాక్షన్ కూడా ఉండబోతోందని ప్రచారం జరుగుతోంది. అలాంటి కథలో హీరోతో పాటు ఆయనకు ఎదురుగా నిలబడే పాత్రను కూడా బలంగా రాసుకోవాలి. అందుకే జస్ట్ పేరున్న నటుడిని తీసుకోవడం కంటే ఆ పాత్రను నమ్మించే వ్యక్తిని ఎంచుకోవడం ఉపయోగపడొచ్చు. ఇక 'ఎల్లమ్మ'ను దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం కూడా అందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 5న సినిమాను విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. తెలుగు మాత్రమే కాకుండా ఇతర భాషల్లోనూ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. మొదటి సినిమాతో తెలంగాణ పల్లె కథను విజయవంతంగా చెప్పిన వేణు, ఈసారి అదే ప్రాంతపు నమ్మకాలు, సంప్రదాయాల నేపథ్యంలో పెద్ద స్థాయిలో సినిమా చేస్తున్నారు. ఇక ప్రమోషన్స్ ఎప్పుడు స్టార్ట్ చేస్తారో చూడాలి.

త్రివిక్రమ్‌కు రెండు పెద్ద పరీక్షలు..పాస్ అవ్వక తప్పదు!

వెంకటేష్‌తో తెరకెక్కించిన ఆదర్శ కుటుంబం ఆశించిన విజయం సాధించకపోవడంతో త్రివిక్రమ్ తదుపరి సినిమాపై ఆసక్తి నెలకొంది.



చిరంజీవికి ఓ కథ వినిపించగా, పూర్తి స్క్రిప్ట్ సిద్ధం చేయాలని మెగాస్టార్ సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎన్టీఆర్‌తో గాడ్ ఆఫ్ వార్ ప్రాజెక్ట్ కూడా ఉండటంతో త్రివిక్రమ్ ముందుగా ఎవరితో సినిమా చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. టాలీవుడ్‌లో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదుపరి సినిమా ఏమిటనే దానిపై.. రకరకాల అట్టలు వినిపిస్తున్నా. వెంకటేష్‌తో ఆయన తెరకెక్కించిన ఆదర్శ కుటుంబం సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో..ఇప్పుడు త్రివిక్రమ్ తన తర్వాతి ప్రాజెక్ట్‌పై చాలా శ్రద్ధ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవితో సినిమా చేయబోతున్నారనే వార్త ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం చిరంజీవి కాకా సినిమాతో బిజీగా ఉన్నారు. మరోవైపు 2027లో విశ్వంభర, కాకా చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాల తర్వాత చిరంజీవి ఎవరితో సినిమా చేస్తారనే విషయంలో ఇప్పటికే పలువురు దర్శకుల పేర్లు వినిపించాయి. ముఖ్యంగా త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో మెగాస్టార్ సినిమా చేయబోతున్నారనే వార్త ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.డిక్టేటర్ల చేతిలో నామినేషన్స్! తాజా సమాచారం ప్రకారం, త్రివిక్రమ్ ఇప్పటికే చిరంజీవికి ఒక కథను వినిపించారట. ఆ కథలోని ప్రధాన అంశం నచ్చడంతో పూర్తి స్క్రిప్ట్ సిద్ధం చేయాలని మెగాస్టార్ చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను డీవీవీ దానయ్య నిర్మించే అవకాశాలు ఉన్నాయని టాక్. గతంలో త్రివిక్రమ్ ఇదే కథను రామ్ చరణ్‌కు కూడా వినిపించినట్లు ఒక వార్త వైరల్ అవుతుంది. అయితే ఇప్పుడు కథలో కొన్ని మార్పులు చేసి చిరంజీవికి సరిపోయేలా సిద్ధం చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఓ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని ప్రచారం జరుగుతోంది. అయితే త్రివిక్రమ్‌కు ఈ సినిమా అనుకున్నంత సులభంగా పట్టాలెక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటికే ఎన్టీఆర్‌తో గాడ్ ఆఫ్ వార్ అనే భారీ ప్రాజెక్ట్‌కు అనౌన్స్ చేశారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయాల్సి ఉంది. మరోవైపు చిరంజీవి కూడా తన సినిమాల షెడ్యూల్స్‌తో బిజీగా ఉన్నారు. దీంతో చిరంజీవి సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందనేది ఆసక్తికరంగా మారింది. అంతేకాకుండా ఎన్టీఆర్ సినిమా ముందు చిరంజీవి చిత్రం కానీ మొదలుపెడితే.. ఆ సినిమా ఫలితం కొంచెం తేడా కొట్టిన.. ఇంకా త్రివిక్రమ్ కు తప్పకుండా జూనియర్ ఎన్టీఆర్ ప్రాజెక్ట్ ఉండదు. కాబట్టి ముందు జూనియర్ ఎన్టీఆర్ ప్రాజెక్ట్ చేస్తారా.. లేకపోతే చిరంజీవి ప్రాజెక్ట్ చేస్తారా అని అనుమానాలు కూడా ఉన్నాయి. ఏదేమైనా ప్రస్తుతం త్రివిక్రమ్ ఉన్న పరిస్థితిల్లో.. ఈ రెండు సినిమాల కూడా ఆయనకు అగ్ని పరీక్షలు లాగా మారాయి. ముఖ్యంగా 'ఆదర్శ కుటుంబం' ఫలితం తర్వాత త్రివిక్రమ్‌పై అంచనాలతో పాటు ఒత్తిడి కూడా పెరిగింది. గతంలో పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్‌లతో విజయవంతమైన సినిమాలు అందించిన ఆయన, ఇప్పుడు మళ్లీ తన సత్తా నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది.

డార్లింగ్ తో మెగాస్టార్.. ఇక రికార్డులు షురూ..!

మెగాస్టార్ చిరంజీవి నిర్వహించనున్న 'మెగావర్స్' టాక్ షోలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సందడి చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం 'ఫౌజీ' షూటింగ్‌లో బిజీగా ఉన్న ప్రభాస్ డేట్స్ కోసం షో నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారట. ఈ ఎపిసోడ్‌లో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా పాల్గొననున్నట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా డేట్స్ ఖరారయ్యే అవకాశం ఉందని టాక్. ప్రభాస్ చాలా అరుదుగా ఇంటర్వ్యూలకు వస్తూ ఉంటారు. కానీ ఆయన వస్తే మాత్రం ఆ ఇంటర్వ్యూ.. ఆయనలానే చాలా స్వీట్ గా ఉంటుంది. ఇప్పుడు అదే జరిగేలా కనిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి తొలిసారిగా ఓటీటీ వేదికపైకి అడుగుపెట్టబోతున్న సంగతి తెలిసిందే. మెగావర్స్ పేరుతో ఆయన ఒక ప్రత్యేకమైన టాక్ షోను ప్రేక్షకుల ముందుకు తీసుకోరానన్నారు. ఈ కార్యక్రమంపై ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా టాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ హీరోలు, దర్శకులు ఈ షోలో సందడి చేయబోతున్నారనే వార్తలు ఆసక్తిని పెంచుతున్నాయి. తాజాగా ఈ షోకు సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో ఒక ప్రత్యేక ఎపిసోడ్ ప్లాన్ చేస్తున్నారట. ప్రభాస్ సాధారణంగా సినిమా ప్రమోషన్లకు, ఇంటర్వ్యూలకు చాలా అరుదుగా హాజరవుతుంటారు. ఆయన బయట కనిపించడం కూడా అభిమానులకు చాలా స్పెషల్ అని చెప్పవచ్చు. అలాంటిది ప్రభాస్ ఒక ఇంటర్వ్యూలో పాల్గొంటే అందులో తనదైన సరదా మాటలతో అందరినీ ఆకట్టుకుంటారు. అందుకే చిరంజీవితో కలిసి ప్రభాస్ ఒకే వేదికపై కనిపిస్తే ఆ ఎపిసోడ్ ఏ స్థాయిలో ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మెగావర్స్ నిర్వాహకులు ప్రభాస్ కోసం ప్రత్యేకంగా ఒక ఎపిసోడ్ రూపొందించాలని భావిస్తున్నారట. ఇందుకోసం ఆయన డేట్స్‌ను సర్దుబాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ తన తదుపరి చిత్రం 'ఫౌజీ' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా



పనుల మధ్య ఆయనకు అనుకూలమైన తేదీల కోసం షో టీమ్ ఎదురుచూస్తోందని ఒక వార్త గట్టిగా వినిపిస్తోంది. ఈ నెలాఖరులోగా ప్రభాస్ డేట్స్ ఖరారైతే ఎపిసోడ్ షూటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభించే అవకాశం ఉందని టాక్. ఈ ఎపిసోడ్‌లో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా పాల్గొనబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నందమూరి బాలకృష్ణ అన్‌స్టాపబుల్ విత్ ఎన్బీకే కార్యక్రమంతో టాక్ షోలకు కొత్త క్రేజ్ తీసుకొచ్చారు. ఇప్పుడు చిరంజీవి కూడా తనదైన శైలిలో మెగావర్స్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మెగా అభిమానులనే కాకుండా ఇతర హీరోల అభిమానులను కూడా ఆకట్టుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్ ఎపిసోడ్ నిజమైతే మెగావర్స్‌కు మరింత క్రేజ్ రావడం.. ఈ ఎపిసోడ్ వ్యూస్ పరంగా రికార్డులు సృష్టించడం.. ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'మెగావర్స్' లోకి 'సీన్' స్టార్ జంట?

ప్రస్తుతం టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరో గానే కాకుండా ఓటిటిలో కూడా బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. తన సెన్సేషనల్ డెబ్యూ మెగావర్స్ టాక్ షో షూట్ ప్రస్తుతం కొనసాగుతుంది. ఆల్రెడీ పలు ఎపిసోడ్స్ షూట్ ని కూడా పాపులర్ సంస్థ నెట్ ఫ్లిక్స్ వారు షూట్ చేశారు. అయితే ఈ షోలో అతిధుల లిస్ట్ లో చాలామంది స్టార్ నటీనటులు హాజరైనట్టు అనధికారిక కన్ఫర్మేషన్ అయితే బయటకి వస్తుంది.ఇక ఇలా లేటెస్ట్ గా మరో స్టార్ జంట చిరు షోలో పాల్గొంటున్నట్టు తెలుస్తుంది. వారే లేటెస్ట్ గా 'సీన్'తో భారీ లాభాలు చూస్తున్న స్టార్ జంట సూర్య మరియు తన భార్య జ్యోతిక అట. ఈ ఇద్దరిపై ప్రస్తుతం కొత్త ఎపిసోడ్ షూట్ కొనసాగుకున్నట్టు రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇక దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక మరో పక్క మెగాస్టార్ కాకా షూట్ కూడా కొనసాగిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 13న విడుదల కాబోతుంది.



Editor, Publiser & Owned by PERIKA ABHILASH, Address: 2-1-243/25/A, AMBEDKAR NAGAR, NALGONDA, TELANGANA-508001.
Printing: KOLANU PRINTERS H. NO: 6-2-1058, PLOT NO. 10, OLD VT COLONY, HYD ROAD, NALGONDA, TELANGANA-508001.